క్లుప్తంగా

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

నల్లకుంట: డాక్టర్స్ డే సందర్భంగా నేడు దత్త సాయి దంత వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ ఎంఎస్ రంగారెడ్డి ప్రకటించారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఎదురుగా, అంబర్‌పేట, రామంతాపూర్, నాగోల్, చైతన్యనగర్ లలోని సాయిదత్త దంత వైద్యశాలల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుంచి 8 వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. అన్ని రకాల దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి టూత్ పేస్ట్ కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. నమోదు చేసుకునేందుకు 92463 66944 నంబరును సంప్రదించాలని కోరారు.

కమ్యూనిటీహాల్ నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: గాంధీనగర్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ నిర్వహణను ఎస్ఆర్‌టీ జవహర్‌నగర్ వ్యాయామశాల, ఆటస్థలం, కల్యాణ మండపం పరిరక్షణ కమిటీకి అప్పగించాలని కోరుతూ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు నర్మెట్ట మల్లేశ్, గుండు నాగేశ్వర్‌రావు, రాకేష్, గుండు జగదీశ్వర్, దేవయ్యలు మాట్లాడుతూ.. ప్రస్తుతం కమ్యూనిటీహాల్ మున్సిపల్ ఆధీనంలో ఉందని శుభకార్యాలు, ఇతర సమావేశాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీహాల్ అద్దె రూ.10 వేలు వసూలు చేస్తున్నా.. మెయింటెన్స్‌లో పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. కాగా కమ్యూనిటీహాల్ నిర్వహణను కమిటీకి అప్పగించాలని ఎమ్మెల్యేను కోరగా సానుకూలంగా స్పందించారన్నారు. కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, ఎస్.శ్రీహరి, నాగులు, గుండు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాము కలకలం !



చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా పక్కన మెయిన్ రోడ్డుపై పాము కలకలం రేపింది. ఈ పాము అకస్మాత్తుగా రోడ్డుపై కనిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రోడ్డు పక్కనే ఉండటంతో స్థానికంగా ఉన్న స్టడీ సర్కిళ్ల పోటీపరీక్షల విద్యార్థులు విషయం తెలుసుకుని గుమిగూడారు. ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి సమాచారం అందించడంతో ప్రతినిధులు, వాలంటీర్లు అక్కడికి చేరుకుని పామును పట్టుకున్నారు. అనంతరం ఫారెస్ట్‌శాఖ అధికారులకు అందజేస్తామని వివరించారు.

కేజీబీవీ ఉపాధ్యాయులను విధుల్లోకి తీసుకోవాలి


విద్యాశాఖ అధికారి అలీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కవాడిగూడ: విధుల్లో నుంచి తొలగించిన 937 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ ఆమ్‌ఆద్మీ అధికార ప్రతినిధి విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లగా.. వారు అందుబాటులో లేకపోవడంతో ఏడీఈ అలీకి అందజేశామన్నారు. 937 మంది కేజీబీవీ ఉపాధ్యాయులను మెరిట్ ఆధారంగా 2021లో ప్రభుత్వం కేజీబీవీ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమించబడి ఎలాంటి సెలవులు లేకుండా సౌకర్యాలు లేకున్నా కేజీబీవీ విద్యార్థులకు విద్యను అందించేందుకు ఎంతో కృషి చేశారన్నారు. వీరిని ఎలాంటి కారణాలు లేకుండా మధ్యలోనే తొలగించడం వల్ల దాదాపు వేయిమంది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. దీంతో వారు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేజీబీవీలో పనిచేస్తున్న వారి స్థానంలో కొత్త వారిని నియమించడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేయడాన్ని ఆమ్‌ఆద్మీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. హైకోర్టు తీర్పును పరిగణలోకి తీసుకుని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ.. జూలై 25న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన శుక్రవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున బీసీలు పాల్గొంటారన్నారు. వచ్చే అసెంబ్లీ–పార్లమెంట్ ఎన్నికలలో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలన్నారు.

- బీసీలను విస్మరించే పార్టీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్పా.. రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండా గత 75 ఏళ్లుగా అన్యాయం చేస్తున్నాయన్నారు.
- జెండాలు మోసుకుంటూ, జిందాబాద్‌ల నినాదాలు ఇస్తూ.. బీసీలను వాడుకుంటున్నారన్నారు. రాజకీయ రంగంలో బీసీల ప్రాతినిధ్యం 14 శాతం దాటలేదని, కేంద్ర ప్రభుత్వం ఇటీవల సేకరించిన గణాంకాల ద్వారా తెలిసిందన్నారు.
- కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభాగణనలో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 52 శాతానికి పెంచాలని ఈ రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలన్నారు.
- బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని దీనికి రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమీలేయర్‌ను తొలగించాలన్నారు. కేంద్ర స్థాయిలో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరారు.
- కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లాల్‌కృష్ణ, శ్రీనివాస్, నీలం వెంకటేష్, నివాస్, రాజేందర్, సురేష్, కిరణ్, అనంతయ్య, సతీష్, జి.క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం చేయూత


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అంబర్‌పేట: బోనాల వేడుకలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట మహంకాళి ఆలయ ప్రాంగణంలో బోనాల వేడుకలపై అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి మంత్రి హాజరై బోనాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఆలయాలకు అందించే ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకుంటే సకాలంలో అందేలా అధికారులను ఆదేశిస్తానన్నారు. ఆలయ ప్రాంగణాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంసీ వేణుగోపాల్, ఏసీపీ ఆకుల శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ జ్ఞానేశ్వర్‌గౌడ్, సలహాదారులు దుర్గాప్రసాద్‌రెడ్డి, అధ్యక్షుడు శంకర్‌గౌడ్ ఆలయ కమిటీ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అందరినీ ఏకం చేసేది క్రీడలే


'గంధం క్వీని విక్టోరియా'ను అభినందిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: దేశంలో ఎన్ని జాతులు, మతాలు, భాషలు, ప్రాంతాలున్నా అందరినీ ఏకం చేసే శక్తి క్రీడలకు మాత్రమే ఉంటుందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈజిప్ట్ రాజధాని కైరోలో ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో జరిగిన స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో భారతదేశం తరపున స్విమ్మర్ 'గంధం క్వీని విక్టోరియా' పాల్గొని 200 మీటర్లు, 400 మీటర్ల మహిళల విభాగంలో పాల్గొని రెండు రజత పతకాలను సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమెను బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. తెలుగు ప్రజల, దేశ ప్రజల మన్ననలు పొందిన క్వీని తెలుగు జాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. క్రీడల్లో ఎన్నో కష్టాలు ఎదుర్కొంటేనే విజయాలు సాధించగలుగుతామని పేర్కొనడానికి క్వీని ఒక నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన సూచించారు. కోచ్ దినేష్ రజోరియా, బీజేపీ నేతలు చిట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, అంతయ్య

చిక్కడపల్లి: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర్ల ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ సత్యనారాయణ, వైస్‌చైర్మన్ అంతయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చిక్కడపల్లిలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 15లక్షల మంది వడ్డెరలు ఉన్నారని వారు రాజకీయ, ఆర్థిక, సామాజిక, విద్యాపరంగా అత్యంత వెనుకబడి ఉన్నారన్నారు. విద్యాపరంగా 1 శాతం కూడా లేరన్నారు. ఎరుకల, లంబాడి, యానాది తదితర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చి వడ్డెర కులాన్ని బీసీ–ఎలో కలిపి తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికి సంచార జీవితం కొనసాగిస్తున్న వడ్డెరలు నేటికి ఓటరు గుర్తింపు కార్డులు లేని కారణంగా జనాభా లెక్కల్లో లేనివారిగా మిగిలిపోయారన్నారు. డైరెక్టర్ ఓర్సు కృష్ణయ్య, సాయి, పెంటేష్, వెంకటేశ్వర్, అనంతరావు, మోహన్‌కుమార్, లక్ష్మీనారాయణ, శ్రీశైలం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో21ను గెజిట్ చేయాలని ధర్నా

చిక్కడపల్లి: కార్మికశాఖ ద్వారా జారీచేసిన సెక్యూరిటీ సర్వీసెస్ కనీస వేతనాల జీవో నంబర్ 21ను గెజిట్ చేయాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ కార్మిక కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలను సవరించలేమన్నారు. జీవోను గెజిట్ చేయకపోవడంతో కనీస వేతనాలు పొందలేక సెక్యూరిటీ గార్డులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వంగూరు రాములు, సాంబయ్య, సోమన్న, రాము, జనార్దన్, లక్ష్మణ్, వెంకటనారాయణ, మహమూద్ తదితరులున్నారు.

ప్రమాదం అంచున స్టీల్ బ్రిడ్జి కార్మికులు



చిక్కడపల్లి: అశోక్‌నగర్ బాలాజీ దర్శన్ వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా పెయింటింగ్ చేస్తున్న కార్మికులు ఎలాంటి సేఫ్టీ పద్ధతులు పాటించకుండా పనిచేస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందిరాపార్క్, అశోక్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, వీఎస్టీ వరకు నిర్మిస్తున్న స్టీల్‌బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ అధికారులు ఇప్పటికైనా తగిన జాగ్రత్తలు తీసుకుని కార్మికులకు తగిన రక్షణ పరికరాలను అందించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పనులను త్వరితగతిన పూర్తి చేయండి


తిరుమలనగర్‌లో రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య


పనులను పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు

కాచిగూడ: అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని బీఆర్ఎస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశాల మేరకు శుక్రవారం కాచిగూడ డివిజన్, చెప్పల్‌బజార్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రోడ్డు, డ్రైనేజీ పనులను జలమండలి అధికారులు, సిబ్బంది, బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన పనులను పర్యవేక్షించారు. పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్, బబ్లూసింగ్, లక్ష్మీనారాయణ, పూర్ణచందర్ తదితరులున్నారు.

పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయండి..

అంబర్‌పేట: డివిజన్‌లో పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేయాలని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని తిరుమలనగర్, మారుతినగర్ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న సీసీరోడ్ల పనులను ఆమె పరిశీలించారు. బోనాలు, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు.

ఆలయంలో పూజలు..

- జైస్వాల్‌గార్డెన్‌లోని ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవానికి కార్పొరేటర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆమెను సత్కరించారు.

చెట్టు కొమ్మలు కొట్టేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ శతాబ్ది పార్కు(మదర్ డైరీ) పార్కులో జీహెచ్ఎంసీ ఉద్యానవన శాఖ అనుమతి లేకుండా భారీ వృక్షాల కొమ్మలను ఇష్టానుసారంగా తొలగించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు. చెట్ల కొమ్మలను తొలగించే ముందు సదరు వృక్షులు 5–10 మొక్కలు నాటి ప్రభుత్వ అనుమతి పొందిన తరువాతే చెట్టు కొమ్మలను తొలగించాల్సి ఉండగా.. ఇలాంటి నిబంధనలను పాటించకుండా చెట్టు కొమ్మలను తొలగించడంపై స్థానికులు మండిపడుతున్నారు. దీనికి కారణమైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నారు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే ప్రజాస్వామిక గొంతుకలను అణిచివేస్తున్నారని సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ కేంద్ర అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ ఆరోపించారు. సాయుధ రైతాంగ ప్రతిఘటన పోరాట విప్లవ ఉద్యమ నేతలు ఎం.వీ.ప్రసాద్, వసంతక్కల 1వ వర్ధంతి సభ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించిన అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాల నాయకులపై కేంద్ర ప్రభుత్వం అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తూ.. తీవ్రమైన చిత్రహింసలకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో భీం ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌ను హత్య చేయాలని కుట్ర చేస్తున్నారని ఇది సరికాదన్నారు. సీపీఐ (ఎంఎల్) చిట్టిబాబు, మల్లేపల్లి ప్రభాకర్, షేక్‌షావలి భవానీ, జక్కుల పాండవులు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు సుధాకర్, పుణ్యవతి, మస్వూద్ బాయి పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

అంబర్‌పేట: ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట ప్రధాన రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల బస్టాప్ వెనుకాల ఉన్న ఖాళీ ప్రదేశంలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని పరిశీలించగా.. దుండగులు బండరాయితో మోదీ చంపినట్లు గుర్తించారు. విచారణలో హత్యకు గురైన వ్యక్తి అంబర్‌పేట బాపూనగర్‌కు చెందిన మహ్మద్‌వాహేద్ కుమారుడు జాకీర్ హుస్సేన్ (40)గా గుర్తించామన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు సంతానం. కాగా.. ఆటో నడుపుతుండేవాడని పాతకక్ష్యలతోనే హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కమల (65) యాకుత్‌పుర రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోటీ పరీక్ష కేంద్రాలు స్థానిక జిల్లాల్లోనే నిర్వహించాలి


వినతిపత్రం అందజేస్తున్న పీవైఎల్ నాయకులు

ముషీరాబాద్: గురుకుల టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ పోటీపరీక్ష కేంద్రాలు స్థానిక జిల్లాల్లోనే నిర్వహించాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరింది. శుక్రవారం గురుకుల నియామక బోర్డు కన్వీనర్ మల్లయ్య బట్టుకు పీవైఎల్ ప్రతినిధి బృందం కే.ఎస్.ప్రదీప్, రవికుమార్, కృష్ణలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గురుకుల నియామక బోర్డు నిర్వహిస్తున్న టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల పోటీపరీక్షలను ఆగస్టు నెలలో నిర్వహిస్తామని గురుకుల బోర్డు ప్రకటించిందన్నారు. ఈ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే సమయంలో స్థానిక జిల్లాల్లో నిర్వహిస్తామని ఆప్షన్స్ ఇచ్చారన్నారు. జిల్లాల్లో కాకుండా హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో పరీక్షలు నిర్వహిస్తే అభ్యర్థులు అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఎంసెట్, నీట్, ఐసెట్, సెట్ వంటి పోటీ పరీక్షలను సీబీటీ పద్ధతిలో జిల్లాల్లో కూడా విజయవంతంగా నిర్వహించిన సందర్భాలు ఉన్నాయన్నారు. గురుకుల టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్ పరీక్షలు ఆయా జిల్లాల్లోనే ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపశమనం కల్పించాలని కోరారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వినతి


హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేత

చిక్కడపల్లి: పార్కుల అభివృద్ధికోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను కలిసి కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లోని అశోక్‌నగర్ పార్క్–2 అభివృద్ధికి నోచుకోక గత కొన్ని నెలలుగా అధ్వాన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కెనరాబ్యాంక్ పార్కు, సురభిపార్కు, అశోక్‌నగర్ కల్చరల్ పార్కు, వివేక్‌నగర్ పీపుల్స్‌పార్కు, చిక్కడపల్లి జనతాపార్కులతో పాటు మిగిలిన అన్ని పార్కులలో కావాల్సిన సదుపాయాలను కల్పించాలని కోరారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పార్కుల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. దీనిపై స్పందించిన డైరెక్టర్ శ్రీనివాస్ పార్కుల అభివృద్ధికి తగిన చర్యలు చేపడుతామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

విస్తృతంగా బీజేపీ మహా సంపర్క్ అభియాన్


ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలన విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తున్నామని బీజేపీ కేరళ రాష్ట్ర నాయకురాలు సుమలత అన్నారు. శుక్రవారం బీజేపీ మహా సంపర్క్ అభి యాన్‌లో భాగంగా శుక్రవారం బాగ్ అంబర్‌పేట లో కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానికంగా అయ్యప్పస్వామి ఆలయంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డిలతో కలిసి ఆలయ అర్చకులకు ప్రధాని సుపరిపాలనను వివరించారు. నాయకులు చుక్క జగన్, వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


అయ్యప్ప ఆలయంలో బీజేపీ నేతలు

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతోనే వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని బీజేపీ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కాచిగూడ డివిజన్ నింబోలిఅడ్డలో నిర్వహించిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో 9 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు బండారు సంతోష్‌కుమార్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ప్రతిభ, లావణ్య, కీర్తి, సూరి, రవియాదవ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.